# నాల్గవ పాఠం الدرس الرابع

## వుజూ الوضوء

వుజూ లేని నమాజు స్వీకరించబడదు. అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు: **"మీలో ఎవనికైనా అపానవాయువు జరిగితే, వుజూ భంగమయితే అతను వుజూ చేసుకోనంత వరకు అల్లాహ్ అతని నమాజును స్వీకరించడు".** (బుఖారి 6954, ముస్లిం 225).

అందుకే ముస్లిం వ్యక్తి నమాజుకు ముందు వుజూ చేయడం తప్పనిసరి.

వుజూ ఘనతలు చాలా ఉన్నాయి, మనిషి వాటిని తెలుసుకోవడం చాలా అవసరం. ఈ రెండుహదీసులు శ్రద్ధగా వినండి:

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా శుభవార్త ఇచ్చారని, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు:**"ఎవరు వుజూ చేసినప్పుడు పూర్తి శ్రద్ధతో మంచి విధంగా చేస్తారో అతని శరీరం నుండి అతని పాపాలన్నీ రాలిపోతాయి. చివరికి గోళ్ళ నుండి కూడా రాలిపోతాయి".** (ముస్లిం 245).

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించారని, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: **"అల్లాహ్ ఆదేశించిన విధంగా సంపూర్ణంగా వుజూ చేసేవారు, వారి ఫర్జ్ నమాజులు వాటి మధ్య జరిగే పాపాలకు పరిహారమవుతాయి".** (ముస్లిం 231).

## వుజూ విధానం كيفية الوضوء

1- వుజూ నియ్యత్ (సంకల్పం) నోటితో పలుకకుండా మనసులోనే చేయాలి. ఒక పని చేయుటకు మనసులో నిర్ణయించుకోవడమే 'నియ్యత్'. మళ్ళీ బిస్మిల్లాహ్ అనాలి.

2- రెండు అరచేతులను మణికట్ల వరకు మూడు సార్లు కడగాలి.

3- మూడు సార్లు నోట్లో నీళ్ళు తీసుకొని పుక్కిలించి, ముక్కులో నీళ్ళు ఎక్కించి శుభ్రం చేయాలి.

4- మూడు సార్లు ముఖము కడగాలి. అడ్డంలో కుడి చెవి నుండి ఎడమ చెవి వరకు. నిలువులో నొసటి పై భాగం నుండి గదువ క్రింది వరకు.

5- రెండు చేతులు మూడేసి సార్లు కడగాలి. వ్రేలు మొదటి భాగము నుండి మోచేతుల వరకు. ముందు కుడి చెయ్యి, తరువాత ఎడమ చెయ్యి.

6- ఒక సారి తల 'మసహ్' చేయాలి. అంటే రెండు చేతులను తడి చేసి తల మొదటి (నుదుటి) భాగము నుండి వెనక మెడ వరకు తీసుకెళ్ళి మళ్ళీ వెనక నుండి మొదటి (నుదుటి) వరకు తలను స్పర్శిస్తూ తీసుకురావాలి.

7- ఒక సారి రెండు చెవుల 'మసహ్' చేయాలి. అంటే రెండు చూపుడు

వ్రేళ్ళతో చెవి లోపలి భాగాన్ని, బొటన వ్రేళ్ళతో పై భాగాన్ని స్పర్శించాలి.

8- రెండు కాళ్ళను వ్రేళ్ళ నుండి చీలమండల వరకు మూడేసి సార్లు కడగాలి. ముందు కుడి కాలు తరువాత ఎడమ కాలు.

➲ అవయవాలు ఒకసారి లేదా రెండు సార్లు కడిగినా పరవాలేదు, కాని ఆ అవయవం సంపూర్ణంగా కడగబడడం తప్పనిసరి.

9- తర్వాత ఈ మస్నూన్ దుఆ చదవాలి: ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించారని, ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: "మీలో ఎవరైనా సంపూర్ణంగా వుజూ చేసుకొని 'అష్ హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహ్' చదువుతారో అతని కొరకు స్వర్గపు ఎనిమిది ద్వారాలు తెరువబడతాయి, ఎందులో నుండి ప్రవేశించగోరినా అతని ఇష్టం". (ముస్లిం 234).

**(నేను సాక్ష్యమిస్తున్నాను; అల్లాహ్ తప్ప సత్య ఆరాధ్యుడెవ్వడూ లేడని, మరియు ముహమ్మద్** సల్లల్లాహు అలైహి వసల్లం **అల్లాహ్ యొక్క దాసుడు మరియు ప్రవక్త).**

**❈ వుజూలో ఒక అవయవం తర్వాత మరో అవయవం క్రమ ప్రకారంగా మరియు వెంటవెంటనే కడుగుట తప్పనిసరి[1].**

[1] **క్రమ ప్రకారంగా** అంటే: 1 నుండి 8 వరకు ఉన్న క్రమం ప్రకారం వీటిలో వెనకా ముందు చేయకూడదు.

**వెంటవెంటనే** అంటే: పై క్రమం ప్రకారం, ఒక అవయవం కడిగాక, దాని తడి ఆరక ముందే వెంటనే దాని వెనక అవయవం కడగాలి. మరీ ఆలస్యం చేయవద్దు.